క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



శ్రావణ శుక్రవారం పూజల్లో మాజీ మంత్రి రోజా

నగరి : పట్టణ పరిధిలోని మాజీ మంత్రి ఆర్కేరోజా నివాసంలో శుక్రవారం శ్రావణ శుక్రవారం లక్ష్మీ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కలశానికి పసుపు, కుంకుమ పెట్టి కొబ్బరికాయకు అమ్మవారి రూపాన్ని అమర్చి పట్టు వస్త్రాలు, ఆభరణాలు, పల పుష్పాలతో అలంకరించారు. పలు రకాల పుష్పాలతో అర్చన చేశారు. ఈ పూజలకు నగరి, నింద్ర ఎంపీపీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, పలువురు మహిళలు హాజరయ్యారు. వారందరికీ సంప్రదాయం ప్రకారం మాజీ మంత్రి జాకెట్టు, పసుపు కుంకుమ, గాజులు, ప్రసాదాలు అందజేశారు.

నేడు ప్రదోషకాల పూజలు



వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్కండ్రిగ సమీపంలో ఉన్న అరుణగిరి కొలువైన శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ప్రదోష కాల పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు రమేష్ తెలిపారు. ఏకకాలంలో నందీశ్వరునికి, శివునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేస్తామన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు నివాళి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కుమారస్వామి రెడ్డి

నగరి : మండలంలోని దామరపాకం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త భాస్కర్ మృతి చెందారు. ఈ క్రమంలో మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు కుమారస్వామి రెడ్డి శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి కార్యకర్త మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులతోపాటు వారి అల్లుడు, పార్టీ నాయకుడు ధనశేఖర్‌ను ఓదార్చారు. పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే మున్సిపల్ పరిధి కరకంతాపురంలో వైఎస్సార్ సీపీ నాయకుడు రేషన్ డీలర్ ఎ.వెంకటరెడ్డి మృతిచెందగా ఆయన కుటుంబాన్ని ఓదార్చారు.


ఇసుక తరలిస్తున్న రెండు లారీలు సీజ్



సీజ్ చేసిన ఇసుక లారీలు

గంగాధర నెల్లూరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పోలీసుల సీజ్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నుంచి గంగాధర నెల్లూరు మీదుగా చెన్నైకి ఇసుక తరలిస్తున్నట్లు సీఐ లక్ష్మన్నకు ముందుగా సమాచారం అందింది. ఆయన తన సిబ్బందితో కలిసి లారీలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం లారీల సమాచారాన్ని మైనింగ్ అధికారులకు తెలియజేశారు.

వినాయక మండపాల అనుమతికి సింగిల్ విండో విధానం



సీఐ మహేశ్వర్

నగరి : వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చేందుకు ప్రభుత్వం సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని తీసుకువచ్చిందని సీఐ మహేశ్వర్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వినాయక చవితి విగ్రహాలు, మండపాల ఏర్పాటుకు వస్తున్న వినతులపై గతంలో అగ్నిమాపక, పురపాలక, విద్యుత్, పోలీసు శాఖల నుంచి ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉండేదన్నారు. ఇప్పుడు సింగిల్ విండో క్లియరెన్స్ విధానం రూపొందించినట్టు తెలిపారు. వినాయక మండపాలు పెట్టదలచుకున్నవారు ganeshutsav.net అనే వెబ్సైట్‌లో కమిటీ సభ్యుల వివరాలు, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, ఏ పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తుంది, విగ్రహం, మండపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ఠ ఏ రోజు జరుగుతుంది, నిమజ్జనం ఎక్కడ ఏ సమయంలో చేస్తారు తదితర వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు "7995095800" నంబర్‌కు వాట్సాప్ ద్వారా "హాయ్" అని సందేశం పంపిస్తే చాలని, నిరభ్యంతర పత్రం కోసం అనుసరించవలసిన ప్రక్రియ మొత్తం వాట్సాప్ ద్వారా వస్తుందన్నారు. ఆ దరఖాస్తు అన్ని శాఖల అధికారులకు వెళుతుందన్నారు. వారు మండపాలను పరిశీలించి క్యూఆర్ కోడ్‌తో ఉన్న పత్రం జారీ చేస్తారని పేర్కొన్నారు. అనంతరం ఎస్‌హెచ్‌వో వాటిని పరిశీలించి ఎన్‌వోసీ జారీ చేస్తారన్నారు. ఈ పత్రాన్ని ప్రింట్ తీసి గణేష్ మండపంలో ఉంచుకోవాలని, పోలీసుల సందర్శన సమయంలో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తనిఖీ చేస్తారన్నారు. శాంతిభద్రతలు, మత పరమైన సంఘర్షణలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో వినాయక చవితిని జరుపుకోవాలన్నారు.

భయం గుప్పెట్లో వైద్యం

వెదురుకుప్పం మండలంలోని మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు పచ్చికాపల్లంలో పీహెచ్‌సీని ఏర్పాటుచేశారు. ఇక్కడికి మూడు మండలాలకు చెందిన రోగులు వస్తుంటారు. రోజుకు సుమారు 150 మంది వరకు ఓపీలు ఉంటాయి. ఇది 24 గంటల ఆస్పత్రి. ఆస్పత్రి గ్రామానికి దూరంగా ఉండడంతోపాటు సరైన రక్షణ లేదు. దీంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ వైద్య సేవలు అందిస్తున్నారు.

– వెదురుకుప్పం

- భద్రత డొల్ల...సౌకర్యాలు నిల్
- వైద్యులకు అభయం ఏదీ..?
- పచ్చికాపల్లం పీహెచ్‌సీలో ఇదీ పరిస్థితి



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పచ్చికాపల్లం పీహెచ్‌సీ గ్రామానికి దూరంగా కార్వేటినగరం ప్రధాన రహదారి పక్కన ఉంది. చుట్టు పక్కల ఇళ్లు లేవు. కనీసం నైట్ వాచ్‌మెన్ లేరు. పోలీసుల గస్తీ అసలు ఉండడం లేదు. ఆస్పత్రి ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయలేదు. ఏమి జరిగినా పట్టించుకునే దిక్కులేదని సిబ్బంది వాపోతున్నారు. అధికారులు స్పందించి తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని వైద్యులు, వైద్యసిబ్బంది కోరుతున్నారు.

కరువైన సౌకర్యాలు

పీహెచ్‌సీలో సౌకర్యాలు అంతంతమాత్రంగా ఉన్నాయి. వైద్య సిబ్బందికి డ్రస్సింగ్‌రూం లేదు. వెయిటింగ్ హాల్ లేదు. పటిష్టమైన గేట్లు లేవు. పీహెచ్‌సీ చుట్టూ ముళ్ల కంపలు, చెట్లు ఉండడంతో విష సర్పాల బెడద ఎక్కువగా ఉంటోంది. పచ్చికాపల్లం ఆస్పత్రి 24 గంటలూ పనిచేస్తుందని డాక్టర్ సురేఖ తెలిపారు. ఊరికి దూరంగా ఉండడంతో భయంతో విధులు నిర్వహించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలని, పోలీసు గస్తీ తిరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా వేణుగోపాలుని పవిత్రోత్సవాలు





పవిత్రాలను ఊరేగిస్తున్న టీటీడీ అధికారులు, వేదపండితులు, ఊరేగుతున్న వేణుగోపాల స్వామి

కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం పవిత్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేకుజామున స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి పవిత్రోత్సవాల సందర్భంగా టీటీడీ వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు చేశారు. అనంతరం రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి పాలు, తేనె, పెరుగు, పసుపు, చందనం, నారికేళ జలాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట మధ్య వేద పండితులు రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి పవిత్ర సమర్పణ చేశారు. అగ్నిహోమం, ప్రతిష్ఠ నవకలశ స్థాపన, పవిత్ర ప్రతిష్ఠ హోమం చేపట్టారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చి చెక్కభజనలు, కోలాటాలు, మేళతాళాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఆరు నుంచి 8 గంటల వరకు యాగశాల, వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి చేపట్టారు. రాత్రి 9.45 గంటలకు స్వామివారిని ఏకాంత సేవలో పవళింప చేశారు. కార్యక్రమంలో ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఆలయ అధికారి సురేష్‌కుమార్, షరాబ్ రమేష్ బాబు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: మండలంలోని వేణుగోపాలపురానికి చెందిన తిరుమలయ్యపల్లె సర్పంచ్ భారతి, చిన్నస్వామి దంపతుల కుమారుడు చందు పెళ్లి శుక్రవారం జరిగింది. ఇందులో మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. జెడ్పీటీసీ సుకుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, ఉపాధ్యక్షుడు రామయ్య, కోఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టె సుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలార్‌ప్రకాష్, నాయకులు వెంకటరెడ్డి, నరేష్‌రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, కేశవులు, అమర్‌నాథ్, రమణ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలి



నగరి : నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నేతలు



కార్వేటినగరంలో..

నగరి : ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) పథకం వద్దని, పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం బస్టాండు ప్రాంగణం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయకుండా, డివిజన్, జిల్లా స్థాయిలో వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌ను చేయడం తగదన్నారు. ప్రజా ప్రభుత్వంలో పెన్షన్ ప్రతి ఒక్కరికీ సమానంగా ఉండాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సొమ్ముతో స్టాక్ మార్కెట్ ఆటలా అంటూ ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధుల పెన్షన్‌లో స్టాక్ మార్కెట్ భాగమేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ తప్ప మరే పెన్షన్ వద్దని స్పష్టం చేశారు. సీపీఎస్ స్థానంలో ఏకీకృత పెన్షన్ స్కీం ప్రవేశపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వాలు నడపడానికి ఉద్యోగుల పెన్షన్ తగ్గించడం సిగ్గుచేటన్నారు. ఒకే పెన్షన్ ఒకే భారత్ అనే విధానాన్ని పాటించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సొమ్మును కార్పొరేటర్లకు పెట్టుబడులు పెట్టే విధానాన్ని మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర సహ అధ్యక్షుడు మునిరత్నం, నాయకులు జనార్ధన్, భువనేశ్వరి, హేమంత్‌కుమార్, కన్నెప్ప, హరిదాస్, సరేష్, రవింద్రబాబు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్ వద్దు.. పాత పెన్షనే ముద్దు

కార్వేటినగరం: యునిఫైడ్(యూపీఎస్) విధానం వద్దని, పాతపెన్షన్ విధానమే ముద్దని యూటీఎఫ్ నాయకులు తెలిపారు. వారు శుక్రవారం గాండ్లమిట్ట కూడలిలో నిరసన తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు దీనావతి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని కోరారు. ఉద్యోగుల నుంచి వసూలు చేసే మొత్తాన్ని స్టాక్ మార్కెట్లలో పెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే యూటీఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్, పీతాంబర్‌రెడ్డి, రాబర్ట్ జైసీలన్, వెంకటేష్, జయశంకర్, రూపావతి, జ్యోతి, లీలాకుమారి, పాపయ్య, రాఘవులునాయుడు, మోహన్, గౌరి, శ్రీదేవి, అరుణ, అనురాధ, ద్రాక్షాయణి, సురేష్, యల్లయ్య పాల్గొన్నారు.

వడమాలపేట పాఠశాలకు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు



కరుణానవనీతంకు అవార్డును అందజేస్తున్న డీఈఓ శేఖర్

పుత్తూరు: వడమాలపేట జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు 2023–24 విద్యా సంవత్సరానికి గాను స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గురువారం జరిగిన జాతీయ క్రీడా దినోత్సవంలో డీఈవో శేఖర్ నుంచి హెచ్ఎం కరుణానవనీతం, పీడీ చంద్రశేఖర్‌రాజు అవార్డు అందుకున్నారు. క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఏటా జరిగే క్రీడా పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొన్న విద్యార్థుల ప్ర తిభ ఆధారంగా పాయింట్లు కేటాయించి డిపార్ట్ మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారు 5 పాఠశాలలకు అవార్డులను అందజేస్తారు. 2023–24 విద్యా సంవత్సరానికి వడమాలపేట పాఠశాల 178 పాయింట్లతో మూడవ స్థానంలో నిలిచి అవార్డు కైవసం చేసుకుంది. కార్యక్రమంలో డీవైఈవో బాలాజీ, డీఎస్‌డీవో సయ్యద్‌బాష, స్కూల్ గేమ్స్ సెక్రటరీలు జయరామయ్య, బాబు పాల్గొన్నారు.

ఘనంగా గోకులాష్టమి

వెదురుకుప్పం: మండలంలోని బందార్లపల్లెలో ఉన్న శ్రీకృష్ణ ఆలయంలో శుక్రవారం గోకులాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేకువజామునే సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో చేపట్టిన అన్నమాచార్య సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. తదుపరి గోపూజ, గో ప్రదక్షిణ, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామికి స్నపన తిరుమంజనం చేశారు. అదేవిధంగా స్వామి వారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవర్లను పెళ్లి పందిటికి వేంచేపు చేసి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

గంగాధర నెల్లూరు: మండలంలోని ఇందిరానగర్ కాలనీలో ఆదివారం చెన్నైకి చెందిన ఎంఎస్ హాస్పిటల్, సీఎస్ఐ పాల్ చర్చి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ నాయకుడు కుట్టి తెలిపారు. ఎంఎం హాస్పిటల్ వైద్యులు రోగులను పరీక్షించి మందులు అందజేస్తారని తెలిపారు. అవసరమైన వారికి చెన్నైలో ఉచితంగా ఆపరేషన్ చేస్తారని పేర్కొన్నారు. ఉచిత భోజనం, ఉచిత వసతి కల్పించనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పుత్తూరు గంగజాతరకు ఆహ్వానం



రోజాను ఆహ్వానిస్తున్న జాతర కమిటీ సభ్యులు

పుత్తూరు: పుత్తూరు పట్టణంలో సెప్టెంబర్ 4న నిర్వహిస్తున్న గంగజాతరలో పాల్గొనాలని మాజీ మంత్రి ఆర్కే రోజాను జాతర కమిటీ సభ్యులు ఆహ్వానించారు. నగరిలోని ఆమె నివాసానికి వెళ్లి సంప్రదాయబద్ధంగా ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులు విక్కీ, శ్రీనివాసులు, సుధాకర్, శంకర్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలని కూలీల నిరసన



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఏపీవో, జేఈ

పాలసముద్రం : ఉపాధి పనులు కల్పించాలని మండలంలోని వెంగళరాజుకుప్పం దళితవాడకు చెందిన ఉపాధిహామీ కూలీలు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ గత రెండు నెలలుగా ఉపాధిహామీ పథకంలో పనులు కల్పించలేదన్నారు. అన్ని పంచాయతీల్లో పనులు చేస్తున్నా వెంగళరాజుకుప్పం దళితవాడలోని కూలీలకు మాత్రం పనులు కల్పించడం లేదని తెలిపారు. ప్రస్తుతం పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌ని తొలగించి కొత్త ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించే వరకు పనులు కల్పించరాదని టీడీపీ నాయకులు సిబ్బందిని బెదిరిస్తున్నారని ఆరోపించారు. దీంతో పనులు లేక తాము ఇబ్బంది పడుతున్నట్టు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధి హామీ పథకంలో 100 రోజుల పని కల్పించాలని కోరారు. విషయం తెలుసుకున్న ఏపీవో మార్గరేట్, జేఈ అనూష, టెక్నికల్ అసిస్టెంట్ రంగనాథం అక్కడికి చేరుకుని వారితో చర్చించారు. మస్టర్ డౌన్‌లోడ్ చేసుకుని మస్టర్‌లో కూలీల పేర్లు చదివి వినిపించారు. ప్రతి రోజూ పని కల్పిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

ప్రతి రైతూ పంటను నమోదు చేసుకోవాలి



ఈ-క్రాప్ నమోదుపై సూచనలిస్తున్న ప్రసాద్‌రావు

పుత్తూరు: పంటలు సాగు చేసే ప్రతి రైతూ ఈ-క్రాప్ బుకింగ్ తప్పని సరిగా చేసుకోవాలని జిల్లా సంయుక్త సంచాలకులు డి.ప్రసాద్‌రావు తెలిపారు. ఆయన శుక్రవారం పుత్తూరు మండలం రామసముద్రం గ్రామంలో రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. క్షేత్ర స్థాయిలో 2024 ఈ-క్రాప్ నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పండించిన పంటలను దళారుల నుంచి కాపాడుకుని, ప్రభుత్వ కనీస మద్దతు ధర పొందాలంటే పంట నమోదు తప్పనిసరన్నారు. ఏపీఎంఐపీ పీడీ జి.సతీష్ డ్రిప్ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రిప్ సాగు విస్తీర్ణాన్ని పెంచాలని సూచించారు. కార్యక్రమంలో పుత్తూరు డివిజన్ ఏడీఏ ఆర్.రమేష్‌రాజు, ఏఓ ఎస్.కోదండయ్య, రైతు సేవా కేంద్రం సిబ్బంది లోకేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డును బాగుచేయండి

- అధికారులు స్పందించకుంటే 15 నుంచి దీక్షలు
- సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు హెచ్చరిక



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

నగరి : పట్టణ పరిధిలోని కుశస్థలి నది లోతట్టు వంతెన వద్ద రోడ్డు దెబ్బతిని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు ఆరోపించారు. ఆయన శుక్రవారం చిద్రమైన రోడ్డు వద్ద సీపీఐ నగరి పట్టణ కార్యదర్శి వేలన్, షబ్బీర్ బాష, కార్యకర్తలతో కలిసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ మార్గంలో అధిక సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయని తెలిపారు. రాత్రిళ్లు గుంతలు కనిపించక ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ఇంతజరుగుతున్నా మున్సిపాలిటీ అధికారులకు ఏమాత్రం పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని, లేకుంటే సెప్టెంబర్ 15 నుంచి సీపీఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కౌన్సిల్ సభ్యులు విజయకుమార్, శేఖర్, ఏఐటీయూసీ నాయకులు రాజేంద్ర, ఆటో యూనియన్ నాయకులు ప్రసాద్, మురళి, అమ్ములు, నంద తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనులను పరిశీలించండి



మాట్లాడుతున్న ఎంఈవో తిరుమలరాజు

పుత్తూరు: ఎస్ఎంసీ సభ్యులు ప్రతి పాఠశాలలోనూ వసతులు, అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని ఎంఈవో తిరుమలరాజు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్లు, గ్రామ, వార్డు సచివాలయాల విద్యా సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రతి సోమ, గురువారాల్లో విద్యా సహాయకులు, బుధ, శుక్రవారాల్లో విద్యా కమిటీ చైర్మన్లు టాయిలెట్ మానిటరింగ్ సర్వే నిర్వహించాలని తెలిపారు. అలాగే మధ్యాహ్న భోజనం, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించాలని తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటలకు హెచ్ఎం యాప్ ద్వారా ప్రొఫార్మాను సబ్మిట్ చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో2 బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి



నగరి: మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం


పుత్తూరు: ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలను నాటాలని మున్సిపల్ చైర్మన్ హరి కోరారు. స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం అటవీశాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వృక్షాలు ఉంటేనే మానవుని మనుగడ సాధ్యమని తెలిపారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించి మొక్కల పెంపకానికి కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రాంగణంలో 50 మొక్కలను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజర్ మాధవి, అధికారులు రవిప్రకాష్, లోకేష్, మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఏకాంబరాచారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృక్షాలతోనే మానవ మనుగడ

కార్వేటినగరం: చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ పొన్న యుగంధర్ తెలిపారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం కుప్పానిగుంట సమీపంలోని నగరవనం వద్ద అటవీశాఖ అధికారి వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి కరణ్‌సింగ్, ఎఫ్ఎస్‌వో రవిరావు, బీట్ అధికారులు గంగులయ్య, దొరస్వామి, వినోద్‌కుమార్, అరుణ, రెహన, టీడీపీ మండల అధ్యక్షుడు చెంగల్‌రాయ యాదవ్, నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు రవి యాదవ్ పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం..

నగరి : మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారిద్దామని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం వనం మనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో చెట్లది ప్రధాన పాత్రన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పుత్తూరు : మొక్కలు నాటుతున్న అధికారులు



కార్వేటినగరం : నగరవనంలో మొక్కలు నాటుతున్న అధికారులు

కనుల పండువగా శ్రీకృష్ణ రుక్మిణీ కల్యాణం





వైభవంగా శ్రీకృష్ణ రుక్మిణి కల్యాణం, కల్యాణానికి హాజరైన భక్తులు

పుత్తూరు: పుత్తూరు పట్టణంలోని గీతా మందిరంలో శుక్రవారం శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శ్రీకృష్ణ, రుక్మిణీ కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం కలశ ప్రతిష్ఠ చేసి, వినాయక పూజ, పలు వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి కల్యాణం చేశారు. అంతకు ముందు గీతా పారాయణం చేశారు.

పీఈటీకి సన్మానం



సెల్వ పాండియన్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

గంగాధర నెల్లూరు : స్థానిక ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న ఆర్కే సెల్వ పాండియన్ ఉత్తమ వ్యాయామ జిల్లా కోఆర్డినేటర్‌గా అవార్డు అందుకున్నారు. గతంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో ఉత్తమ వ్యాయామ కార్య నిర్వాహకుడిగా సేవలు అందించడంతోపాటు విద్యార్థులను రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనేలా చేశారు. ఆయన చేసిన సేవలకు పురస్కారం లభించింది. ఆయనను ప్రధానోపాధ్యాయురాలు హేమలత, ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు



బాలు విసురుతున్న ఎంఈవో

నగరి : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరి మండలంలోని ఉపాధ్యాయులకు ఆటల పోటీలను శుక్రవారం నిర్వహించారు. కోకో, వాలీబాల్, క్రికెట్ తదితర పోటీలను నిర్వహించారు. ఎంఈవో శ్రీదేవి పర్యవేక్షించారు.